క్లుప్తంగా...

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలోని కాశీ విశ్వనాథ సమేత నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఆలయంలో అఖండ దీపారాధన, శ్రీ సూక్త పారాయణం నిర్విరామంగా కొనసాగుతుంది. ఆదివారం 108వ రోజు ఆలయం ఆవరణలో చండీ హోమం నిర్వహించారు. అందులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయం ట్రస్ట్ తరఫున ఏర్పాటు చేసిన అన్నదానం పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు రాజ్‌కుమార్, కుమార్‌గౌడ్, పద్మారావు, నరేందర్, కృష్ణస్వామి, మోహన్‌సింగ్, మల్లేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం సందర్శన వేళలు

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామం ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. వారాంతంలో సాయంత్రం 5.30 గంటల నుంచి శిల్పారామంలోని ఆంఫీథియేటర్‌లో సందర్శకుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఫీజుల ఇలా

పెద్దలకు రూ.60

పిల్లలకు. రూ.20

బోటింగ్ ఛార్జీలు రూ.30

- బ్యాటరీ ఆపరేటెడ్ కారు చార్జీలు రూ.15
- ఎడ్లబండి ఒక్కరికి ఛార్జీలు.....రూ.20

నేడు జీఎల్‌ఐటీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

రాయదుర్గం: పాలిసెట్–2023 ఫలితాల వెల్లడితో రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించడంతో ఇక సందడి వాతావరణం కనిపించనుంది. రాష్ట్రంలో ఏకైక గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ విద్యాసంస్థ కొనసాగుతోంది. దీంట్లో చదివిన వారందరికీ ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడంతో ఈ ఇన్‌స్టిట్యూట్‌కు మరింత ప్రాధాన్యత నెలకొంది.

- రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశంపై ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ అవగాహనా కార్యక్రమంలో 24 కోర్సుల గురించి వివరించడంతో జీఐఎల్‌టీలో నిర్వహించే కోర్సులు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరిస్తారు.

ఫుట్‌బాల్ విజేత లయోలా గుంటూరు జట్టు

రాయదుర్గం: సీఐఎస్‌సీఈ స్కూల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్–19 విజేతగా లయోలా గుంటూరు జట్టు నిలిచింది. గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్ మైదానంలో సీఐఎస్‌సీఈ స్కూల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్–2023ని నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం అండర్–19 ఫుట్‌బాల్ ఫైనల్లో లయోలా గుంటూరు జట్టు–హెచ్‌పీఎస్ బేగంపేట్ జట్ల మధ్య జరగగా లయోలా గుంటూరు జట్టు 1–0 స్కోరుతో విజయం సాధించింది. ఈ విజేతలకు ఆగష్టు చివరి వారంలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు పూజలు



గోల్కొండ: పోతరాజుల వృత్తి వంశపార్యపరంగా కొనసాగిస్తున్నామని పోతరాజు తల్వార్ శివ అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలబజార్‌లోని శివాలయ ప్రాంగణంలో పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం అమ్మవార్లపై ఉన్న భక్తి, పోతరాజు వృత్తిపై మమకారంతోనే తాము ఈ వృత్తిలో కొనసాగుతున్నామన్నారు. చాలీచాలని ఆదాయంతోనే జీవితం సాగిస్తున్నామని ఆయన అన్నారు. శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయ వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి మాట్లాడుతూ.. పోతరాజులకు ప్రభుత్వం ప్రతినెలా గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈనెల 22న ఈసారి రిసాల బజార్ నుంచి మహంకాళి అమ్మవారి జులూస్ ప్రాంభమవుతుందని, శ్రీకాంత్ చారి ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ ఊరేగింపులో 57 మంది పోతరాజుల విన్యాసాలు ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతరాజులు భరత్, నగేష్, నరేష్, రాజు, శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–1 పరీక్షలు

బండ్లగూడ: ప్రశాంతంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలు ముగిశాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్‌ఎస్‌ఆర్ కాన్సెప్ట్ స్కూల్‌లో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు కొనసాగాయి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని బాంబ్ స్క్వాడ్ పూర్తిగా తనిఖీ చేసింది. పరీక్ష సందర్భంగా అభ్యర్థులు కేంద్రానికి గంట ముందుగానే వచ్చి చేరుకున్నారు. పరీక్షా సమయం కంటే 15 నిమిషాల ముందే గేట్లు బంద్ చేశారు.

పరీక్షకు అనుమతించలేదు..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఎల్ఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్‌లో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలు జరిగాయి. పరీక్షా సమయం కంటే 15 నిమిషాల ముందే గేట్లను మూసి వేయడంతో 10.22 గంటలకు పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థిని అధికారులు లోనికి అనుమతించలేదు. లేటుగా వచ్చావు అంటూ వెనక్కి పంపించి వేశారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి ఎంత ప్రాధేయపడిన పరీక్ష రాసేందుకు అనుమతించలేదు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గ్రూప్–1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం గ్రూప్–1 పరీక్షల నేపథ్యంలో రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటల నుంచి విద్యార్థుల రాక ప్రారంభమైంది. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాలను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ డీసీపీ డివిజన్ పరిధిలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల్లో ఆదివారం 12000 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు నలుగురు పోలీసు సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.



పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్ పోలీసులు



పరీక్ష రాసేందుకు ఉదయం 10:22 గంటలకు కేంద్రానికి చేరుకున్న అభ్యర్థిని లోనికి ప్రవేశించకుండా ఆపుతున్న అధికారులు





హైదర్‌గూడ టైనీ స్కాలర్స్ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి



లోక్ అదాలత్‌లో కేసులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి నీలిమ తదితరులు

రాజేంద్రనగర్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 24,308 కేసులను పరిష్కరించారు. రాజీపడిన కేసులు 18, అడ్మిషన్ కేసులు 230, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 7107, ఈ–పెట్టి కేసులు 16,779, డీవీసీ కేసులు మూడులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్‌కరిణ్, 13వ న్యాయమూర్తి అంకిత్, స్పెషల్ కోర్టు న్యాయమూర్తులు రానోజీ, నజీరుద్దీన్, డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్, ప్రవీణ్, సంగీత, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి రామకృష్ణగౌడ్, లోక్ అదాలత్ సభ్యులు వెంకట్‌రెడ్డి, సుదర్శన్, సుధాకర్‌రెడ్డి, సుజాత, వరప్రసాద్, కోర్టు సిబ్బంది వెంకటరంగారెడ్డి, భాస్కర్, నరేష్‌గౌడ్, రాజేంద్రనగర్, వివిధ ఠాణాల ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేస్తే జరిమానాలు తప్పవు



జరిమానా విధిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్

అత్తాపూర్: ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదని వారికి జరిమానాలు విధిస్తున్నట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ వెల్లడించారు. అత్తాపూర్, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, వ్యాపారాలు నిర్వహిస్తున్న వారితో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి'దిన పత్రికలో 'రోడ్లపైనే వ్యాపారాలు'అనే శీర్షికను ప్రచురించింది. దీనికి స్పందించిన ఆయన అత్తాపూర్, హైదర్‌గూడలో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ రహదారిని వ్యాపారులు ఆక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి వారిని అడ్డుకట్ట వేస్తామన్నారు. మరోసారి ఈ ప్రాంతంలో రోడ్డును ఆక్రమిస్తూ వ్యాపారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆస్పత్రుల అవసరం పెరుగుతుంది: ఎమ్మెల్యే



లక్ష్మీప్రియ కాలనీలో చిన్నపిల్లల ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: హైదరాబాద్ నగర శివారు మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆస్పత్రుల అవసరం పెరుగుతుందని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ, లక్ష్మీప్రియ కాలనీలోని సుజన్ ప్లాజాలో కడల్ చిన్నపిల్లల ఆస్పత్రిని మున్సిపల్ చైర్మన్ కె.నరేంద్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని రకాల ఆస్పత్రులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసర సమయంలో సమీపంలో ఆస్పత్రులు ఉంటే ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిదీప్ యలవర్తి, సీనియర్ జర్నలిస్టు సుధాజగన్, కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, నవీన్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, తాజుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, నాయకులు యాలాల నరేష్, బి.ముత్యాలు, బి.రవికాంత్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, బషీర్, ప్రమోద్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హోరాహోరీగా దివ్యజ్యోతి యూత్ ఎన్నికలు



గెలుపొందిన నాయకులతో యువజన సంఘం ముఖ్య సభ్యులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ క్వార్టర్స్(వీకర్ సెక్షన్) కాలనీ దివ్యజ్యోతి యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. చివరి వరకు ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో నిలవడంతో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. అందులో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శుల పదవులకు పోటీ తీవ్రంగా ఏర్పడింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం లెక్కింపు చేపట్టారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎ.నరేష్ 38 ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా బి.నరేందర్ 60 ఓట్లు, ఉపాధ్యక్షుడిగా ఎస్. అనిల్‌కుమార్ 26 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణికొండ క్వార్టర్స్ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

మదన్‌పల్లి గిరిజన రైతులకు అండగా కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్

శంషాబాద్ రూరల్: మదన్‌పల్లిలో గిరిజనుల నుంచి అన్యాయంగా తీసుకున్న భూములను తిరిగి వారికి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం భూములను సందర్శించిన ఆయన బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే నంబరు 50లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా గాంధీ హయాంలో స్థానిక గిరిజనులకు 560 ఎకరాలను అసైన్డ్ చేసిందని తెలిపారు. రియల్టర్లు రైతుల నుంచి ఈ భూములను అక్రమంగా కాజేశారని ఆరోపించారు. ఈ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలకు స్థానిక సర్పంచు ఇంటి నెంబర్లు కేటాయించి అక్రమాలకు పాల్పడినట్లు విమర్శించారు. వైఎస్ ఎంపీపీ భర్త, అతని అనచరులు సుమారు 50 ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జనరల్ సెక్రటరీ మహేందర్, డీసీసీ ప్రతినిధి పరమేష్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



క్రికెట్ గ్రౌండ్ పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: మున్సిపాలిటీ కేంద్రంలో చేపడుతున్న క్రికెట్ గ్రౌండ్, శ్మశాన వాటిక పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ కేంద్రం, ల్యాంకోహిల్స్ పక్కన కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీ యువకులకు క్రికెట్ గ్రౌండ్, అందరికీ శ్మశాన వాటిక ఎంతో సుందరంగా తయారవుతున్నాయన్నారు. రెండు పనులు పూర్తయితే పెద్ద సమస్యలు తీరడంతో పాటు మంచి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు జె.సిద్దప్ప, నాయకులు బి.రవికాంత్‌రెడ్డి, ఎ.రాములు, కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి. వై.బాబు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

గచ్చిబౌలి: వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సాగింది. ఆదివారం కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ స్థాపన, నాగదేవతలు, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసిన తర్వాత భక్తులను దర్శనం కల్పించారు.

నేడు రాజేంద్రనగర్‌లో 'తెలంగాణ రన్'

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) ఆధ్వర్యంలో అధికారికంగా జరిగే ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్, సీఐలు, స్థానిక కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారన్నారు. తెలంగాణ రన్ కార్యక్రమాన్ని ఉదయం 6 గంటలకు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కళాశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ఏఐటీయూసీ మహాసభల్లో రాష్ట్ర నాయకులు



రాజేంద్రనగర్: కార్మికుల శ్రేయస్సు కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జూన్ 11, 12వ తేదీలలో జాతీయ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల శ్రేయస్సు, ఏఐటీయూసీ కార్యాచరణపై ఈ మహాసభలు జరుతున్నాయన్నారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పోరాడుతున్నామన్నారు.

కులం పేరుతో సర్పంచ్‌ను దూషించిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్: కులం పేరుతో సర్పంచ్, ఆమె కుమారుడిని దూషిస్తూ బూతులు తిట్టిన ఘటనలో పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జూకల్ గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. సర్పంచ్ కోడూరి నర్సమ్మ, ఆమె కుమారుడు సదానందం కలిసి శనివారం సాయంత్రం పనులను పరిశీలిస్తున్నారు. ఈ సమయంలో అక్కడ ఉన్న మహేందర్‌రెడ్డి వచ్చి సర్పంచ్, ఆమె కుమారుడిని కులం పేరుతో దూషించడంతో పాటు బూతులు తిట్టారు. అంతేకాకుండా మరికొందరితో కలిసి దాడికి యత్నించడంతో పాటు చంపేస్తామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్గానిక్ గాలా ఫ్లీ మార్కెట్ ప్రారంభం



నిర్వాహకులతో కలిసి ఆర్గానిక్ గాలా ఫ్లీ మార్కెట్ ప్రారంభిస్తున్న రేణుకాచౌదరి

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆర్గానిక్ గాలా ఫ్లీ మార్కెట్‌ను ప్రారంభించారు. సస్టేనబిలిటీ, ఫ్యాషన్, సంగీతం, జ్ఞానోదయమైన సేషన్లతో కూడిన వేడుకను ఆదివారం నిర్వహించారు. ఈ మార్కెట్‌ను నిర్వాహకులతో పాటు మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి ప్రారంభించారు. ఈ ఆర్గానిక్ గాలా ఫ్లీ మార్కెట్ విభిన్న శ్రేణి స్థిరమైన బ్రాండ్‌లను ప్రదర్శించడానికి సెట్ చేయబడింది. ఈ ఈవెంట్‌లో గాయకుడు రాహుల్ సిప్లీగంజ్ తన సంగీత నైపుణ్యంతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి మజ్లిస్ కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్

రాజేంద్రనగర్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం మజ్లిస్ పార్టీ నిరంతరం పాటుపడుతుందని పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు షేక్‌రియాజ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున మజ్లిస్ పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి రహమత్‌బేగ్ పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత పెద్ద ఎత్తున మజ్లిస్ పార్టీలో సభ్యత్వం తీసుకుంటుందన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం పార్టీ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. త్వరలో సర్కిల్‌తో పాటు బండ్లగూడ కార్పొరేషన్, శంషాబాద్, మణికొండ, నార్సింగి మున్సిపాల్టీల పూర్తి స్థాయి కమిటీలను వేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, శాసన సభ నేత అక్బరుద్దీన్ ఒవైసీ సూచనలు, సలహాల మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్ అహ్మద్, షేక్ నవాజ్, షేక్ అక్బర్, టిప్పుతో పాటు మరో 150 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్, షేక్ రియాజ్, ప్రవీణ్, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పంచవటి కాలనీ అధ్యక్షుడిగా సీతారాం



మాట్లాడుతున్న అధ్యక్షుడు సీతారాం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలో జరిగిన సమావేశానికి నివాసితులు పెద్ద ఎత్తున హాజరై కాలనీ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా డి.సీతారాంను రెండోసారి అధ్యక్షుడిగా, సాగర్‌ను ప్రధాన కార్యదర్శిగా, సతీష్‌ను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, ఒక కార్యనిర్వాహక కార్యదర్శిని, సహాయ కోశాధికారిగా ఒకరిని, 11మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన సమస్యగా ఉన్న పందెన్‌వాగు బాక్స్ డ్రైన్ పనులు ఇటీవలనే ప్రారంభించారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టేలా మున్సిపాలిటీతో కలిసి పనిచేస్తామన్నారు.



వట్టినాగులపల్లిలో ఎల్లమ్మ ఆలయాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మిస్తాం

మణికొండ: వట్టినాగులపల్లిలో రోడ్డు విస్తరణ పనులతో కనిపించకుండా అయిన ఎల్లమ్మ ఆలయాన్ని పెద్దగా నిర్మిస్తామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి అన్నారు. ఆదివారం గ్రామస్తులు ఆలయం కనిపించకుండా అయ్యిందని, పరిశీలించాలని కోరటంతో గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయం ప్రైవేటు వ్యక్తుల భూమిలో ఉండటంతో వారు తగినంత స్థలం కేటాయిస్తే పెద్ద ఎత్తున ఆలయాన్ని నిర్మింపచేసేందుకు దాతల సహకారంతో పనులను చేపడతామన్నారు. సోమవారం భూ యజమానితో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.నగేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్



బెల్టులను ప్రదానం చేస్తున్న తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ పొందిన విద్యార్థులకు కలర్ బెల్ట్‌లను బహూకరించారు. తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ పేరుతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తైక్వాండోను అభ్యసించడం ద్వారా ఆరోగ్యం, చక్కని గణశీలత పొందుతారని దీని వల్ల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తైక్వాండో కోచ్‌లు ఎస్.ప్రదీప్‌కుమార బి.సురేష్‌ను సన్మానించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

శంషాబాద్ రూరల్: మల్కారంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక సర్పంచ్ కొత్త మాధవియాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఆరు టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఎస్ఆర్‌హెచ్ టీం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు నిర్వాహకుల చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లలితజంగయ్య, వార్డు సభ్యులు లక్ష్మణ్, ఆర్గనైజర్స్ రంజిత్, ప్రభాకర్, వీరేశ్, ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు